క్లుప్తంగా

రైతుబజార్లలో తనిఖీలు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలో గల పలు రైతు బజార్లను మార్కెటింగ్ డైరెక్టర్ శోభారాణి, డైరెక్టర్ అప్పారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి స్టాళ్లను తనిఖీ చేశారు. కంచరపాలెం రైతుబజార్‌లో మార్కెటింగ్ డైరెక్టర్లు జీవా, లావణ్య పర్యవేక్షించారు. నూతనంగా రైతుబజార్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భగవద్గీత శ్లోకాల పఠనం



గ్లాస్ గేమ్ ఆడుతున్న చిన్నారులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు పదాలను అక్షర దోషాలు లేకుండా ఉచ్చరించే విధానంపై చిన్నారులు సాధన చేశారు. శ్లోకాల పఠనంలో శరీర అవయవాలు ఎలా పని చేస్తున్నాయో విద్యార్థులు గుర్తించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జీఎస్ఎన్ మూర్తి పాల్గొని భగవద్గీత శ్లోక పఠనాన్ని పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులతో గ్లాస్ గేమ్ ఆడించారు. పిల్లలకు చాక్‌లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్రిపాలెం: బర్మా కాలనీలో శానిటరీ అధికారులు సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జోన్–5 ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై, అలాగే వాతావరణంలో వస్తున్న మార్పులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అన్నారు. తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో గీసిన చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి సృజనకు అనుగుణంగా బొమ్మలు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు గ్రంథాలయంలో గల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక, సాంఘిక, జనరల్ నాలెడ్జి, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలతో కూడిన పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందించారు.

అప్పన్నకు బుధవారం గరుడ సేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో అర్చకులు ఈ సేవ నిర్వహించారు.

కదం తొక్కిన ఉత్తర దండు



నిరసన ర్యాలీలో అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం
- నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- కూటమి ఏడాది అసమర్థ పాలనపై ప్రజల ధ్వజం
- హామీలు విస్మరించిన చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు

సీతంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా పాలకులు ప్రజలను మోసం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతల నయవంచనకు నిరసనగా.. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున ర్యాలీగా తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. వైఫల్యాను ఎండగట్టారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



సీతంపేట నుంచి మువ్వల పోలారావు ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరిన పార్టీ శ్రేణులు

25, 44 వార్డుల నుంచి..

- జీవీఎంసీ 25వ వార్డు మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, మువ్వల సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యర్తలు, మహిళలు సీతంపేట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.
- 25వ వార్డు గణేష్‌నగర్ నుంచి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భోగవిల్లి గోవింద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులపై ర్యాలీగా నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. పార్టీ నాయకులు సారిపిల్లి సంతోష్, పోతుబంతి హరికృష్ణ, బొమ్మాళి రవి, కొమ్ము నాగు, మందు అప్పలరాజు, సువర్ణపూడి సత్యనారాయణ, పప్పు ప్రసాద్, దివాకర్, వియ్యపు సంతోష్,, శేఖర్, సూరిబాబు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.
- 44వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు నుంచి కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీగా పార్టీ శ్రేణులు పాదయాత్రగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, తిరుపతి, రమణ, రంగమణి, బాద శ్రీను, మహదాస్యం గోపి, నారాయణ, కార్యకర్తలు, అభిమానులు, బానాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.



80 ఫీట్ రోడ్డు నుంచి ర్యాలీగా తరలివెళ్తున్న కార్పొరేటర్ బానాల శ్రీనివాస్, పార్టీ శ్రేణులు

24వ వార్డు నుంచి..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నుంచి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. నక్కవానిపాలెంలోని ఆమె నివాసం నుంచి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

49, 51 వార్డుల నుంచి..

మద్రిపాలెం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఎటువంటి పథకాలు అందజేయలేదని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. మోసపూరిత హామీలతో ముఖ్యమంత్రి అయి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న వ్యక్తి చంద్రబాబని విమర్శించారు. వార్డులోని వంద మంది నాయకులతో కలిసి ఆయన ర్యాలీగా వెళ్లి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికొదిలేశారని, చంద్రబాబు చేసిన మోసాలకు ప్రజలే సరైన బుద్ధి చెబుతారని వెంకటరమణ అన్నారు.



గణేష్‌నగర్ నుంచి భోగవిల్లి గోవింద్ ఆధ్వర్యంలో బైకులపై ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు



24వ వార్డు నుంచి బయలుదేరిన కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ శ్రేణులు



49వ వార్డు నుంచి కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరిన నాయకులు



51వ వార్డు నుంచి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్తున్న నాయకులు

నిరసన ర్యాలీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 46వ వార్డు నుంచి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి తరలివెళ్లాయి. జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, బి.గోవిందరాజు, కె.చిన్నా, దూది నరసింహారావు, కోట రామారావు, ఎస్.ఈశ్వరరావు, కె.శ్రీను, ఎస్.వి.రమణ, జి.అప్పారావు, లావణ్య, కె.ఈశ్వరరావు, అప్పలరెడ్డి, నారాయణరెడ్డి, విజయలక్ష్మి, దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



46వ వార్డు నుంచి ర్యాలీగా వెళ్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సేనాపతి అప్పారావు, పార్టీ శ్రేణులు

గాన గంధర్వుడు బాలు



ఎస్పీ బాలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థల సభ్యులు

మద్రిపాలెం: తెలుగు చిత్రసీమకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేసిన సేవలు చిరస్మరణీయం అని మెలోడి క్రియేటర్స్ సంగీత సేవా సంస్థ, రైల్వే క్వార్టర్స్ కాలనీ కేర్ టీం సభ్యులు అన్నారు. ఈ మేరకు వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో గల వనవిహార్ పార్కులో ఎస్పీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మధురమైన గాత్రంతో సినీ రంగానికి ఎన్నో మధురమైన గీతాలు అందించి అందరి మనసుల్లో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి బాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, ఫణిస్వామి, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



దొండపర్తిలో బాలసుబ్రహ్మణ్యం జయంతిలో పాల్గొన్న అభిమానులు

బాలు అభిమానుల ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి ఆయన అభిమానులు దొండపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని బీచ్‌రోడ్‌లో ఎస్పీ బాలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బాలు అభిమానులు కోరారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి వాసు, కబడ్డి శ్రీను, సీబీఐ ఆనంద్, ఇంటీరియర్స్ మధు, బిల్డర్ రవికాంత్, జీవీ రమణ, వెంకీ, సాయి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉదయం 6.30 గంటలకు మాధవధార బస్టాప్ నుంచి వాకర్స్ పార్కు వరకు వాకర్స్, స్థానికులలతో కలిసి ర్యాలీ చేస్తామన్నారు. క్లబ్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రధానోపాధ్యాయుడిగా రాము బాధ్యతల స్వీకరణ



తాటిచెట్లపాలెం: ఎన్ఎంసీహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యయుడిగా కె. రాము బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాము ఈ స్కూల్‌కు విచ్చేసారు. ఇప్పటి వరకు రైల్వేన్యూకాలనీలో గల కేవీఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా రాము పని చేశారు. ఆ స్కూల్లో దాదాపు 8 ఏళ్లు ఈయన పనిచేశారు.

విధుల్లో అంకితభావం అభినందనీయం



వారధి మహన్వాత దంపతులను సత్కరిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

సీతంపేట: వైద్య ఆరోగ్య శాఖలో 27 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించి ప్రజలు, అధికారుల మన్ననలు అందుకోవడం అభినందనీయమని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి అన్నారు. మలేరియా సబ్ యూనిట్ విశాఖపట్నంలో హెల్త్ సూపర్‌వైజర్ వారధి మహన్వాత పదవీ విరమణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె మహన్వాత, జయలక్ష్మి దంపతులను పూలదండ, దుశ్శాలువాతో సత్కరించి, సన్మాన పత్రం, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ సమయపాలన, అంకితభావం, కార్యనిర్వహణ, చురుకైన వ్యక్తిత్వం మహన్వాత నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు, మలేరియా విభాగం, మానసిన వైద్యశాలలో మహన్వాత చేసిన సేవలను కొనియాడారు. ఆయన శేష జీవితం యురారోగ్యాలతో ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎంపీహెచ్ఈవోలు శ్రీనివాస ఆచారి, శేషబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ, యూపీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటులో పుస్తకాల వ్యాపారం



చంటిపిల్లతోనే క్యూ లైన్‌లో



గోదాం మెట్ల వద్ద కింద కూర్చొని పుస్తకాలు చూసుకుంటున్న తల్లిదండ్రులు

- స్కూళ్లు తెరవకముందే హడావుడి
- ఒకటో తరగతి పుస్తకాలకు రూ.5 వేల వసూలు
- చోద్యం చూస్తున్న మండల విద్యా శాఖాధికారులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు పుస్తకాలతో కూడా వ్యాపారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేటు స్కూళ్లల్లో అడ్మిషన్లకు డిమాండ్ ఉండడంతో ఇదే అదునుగా వ్యాపార విస్తరణకు కొత్తదారులు వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్కూళ్లకు అనుబంధంగా పుస్తకాల విక్రయ దుకాణాలు కూడా తెరుస్తున్నారు. ఎన్ఏడీ సెంటర్‌లోని బుచ్చిరాజుపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అడ్మిషన్లు తీసుకున్న వారందరికీ బుధవారం నుంచి పుస్తకాల విక్రయం మొదలుపెట్టారు. స్కూల్‌కు సమీపంలోని ఓ గోదాములో పుస్తకాలు నిల్వ చేసి, అక్కడికి వచ్చి కొనుగోలు చేయాలని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు గోదాము ముందు క్యూ కట్టారు.

ధరలపై నియంత్రణ ఏదీ

పుస్తకాల కోసం గాలి, వెలుతురు సరిగా లేని గోదాములో గంటల తరబడి వేచి ఉండలేక కొంతమంది తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల విక్రయాలు చేపట్టరాదని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ..సవ్యంగా అమలు కావడం లేదు. ఒకటో తరగతి విద్యార్థికి రూ.5 వేలు పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు. అదే 9వ తరగతి అయితే రూ.15 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు అంటున్నారు. ఈ రీతిన ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి పుస్తకాలు విక్రయించడంతో సామాన్య,మధ్య తరగతి కుటుంబాల వారికి చదువులు భారమవుతున్నాయి.

చోద్యం చూస్తున్న విద్యా శాఖ

మండల విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల విషయంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్‌లో దర్జాగానే పుస్తకాలు విక్రయాలు జరుపుతున్నా విద్యాశాఖాధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

మందుబాబుల చిందులు.. స్థానికుల బెంబేలు

- మాధవధార ప్రధాన రహదారిలో రెచ్చిపోతున్న తాగుబోతులు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు



తాగి విసిరేసిన మద్యం గ్లాసులు తీస్తున్న కార్మికుడు



ఇష్టానుసారంగా రోడ్డుపై పడేసిన మద్యం బాటిళ్లు



నిర్మాణంలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్



కూర్చున్న చోటే వదిలేసిన మద్యం సీసా

మద్రిపాలెం: రోజు రోజుకూ మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. మద్యం సేవించి చిందులు వేస్తూ హల్‌చల్ చేస్తున్నారు. ఎవరైనా పొద్దున్న నిద్ర లేవగానే దేవుడి దర్శనం చేసుకోవాలనుకుంటారు. కానీ మాధవధార జంక్షన్‌లో దీనికి భిన్నంగా తాగి పడేసిన మందు సీసాలు, గ్లాసులు రోడ్లపై దర్శనమిస్తున్నాయి.

మాధవధార ప్రధాన కూడలిలో..

జీవీఎంసీ 50వ వార్డు మాధవధార మెయిన్ రోడ్డులో 48వ నంబర్ బస్ జంక్షన్ వద్ద మందుబాబులు పూటుగా మద్యం తాగి చిందులేస్తూ రెచ్చిపోతున్నారు. అక్కడే ఉన్న వైన్ షాపులో నడిరోడ్డుపై మద్యం సేవించడం, అక్కడే గ్లాసులు, సీసాలు రోడ్లపై పడేయడంతో మార్నింగ్ వాక్ చేసే వారికి రోడ్డుపై ఉదయాన్నే ఎటుచూసినా మద్యం సీసాలు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. దీంతో మాధవధార జంక్షన్ వైపు వాకింగ్‌కు వచ్చే మహిళా వాకర్లు విసుక్కుంటున్నారు. పారిశుధ్య కార్మికులు సుమారు 6.30 లేదా 7 గంటల ప్రాంతంలో ఆయా ప్రాంతాల్లో చెత్త తీస్తారు. అయితే వారి పనే వారికి భారం దీనికి తోడు ఇప్పుడు మందుబాబుల చాకిరీ కూడా ఎక్కువైంది. మద్యం షాపు ఏర్పాటు చేసిన తర్వాత అక్కడే దాని ఎదురుగా రెండు మూడు దుకాణాలు ఉన్నాయి. చికెన్ పీస్‌లు కల్చి తాగుబోతులకు అందించడం, అలాగే మరికొన్ని షాపుల చాటున సిగరెట్లు, మద్యం తాగేందుకు ప్లాస్టిక్ గ్లాసులు, గుట్కా వంటివి విక్రయిస్తున్నారని, మందుబాబుల పని సులువవుతుందని పలువురు చెబుతున్నారు. కొద్ది రోజుల తర్వాత స్కూళ్లు, కాలేజీలు తెరుచుకుంటాయి. మాధవధార ప్రజలు మాధవధర నుండి ఎవరు ఎక్కడికి వెళ్లాలన్నా అదే జంక్షన్‌లో బస్టాండ్ ఉంది. ఇలా మందుబాబులు చిందులేస్తుంటే బస్సులెక్కేది, దిగేది ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వైన్ షాపుకు కూతవేటు దూరంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మిస్తున్నారు. తమ పిల్లలు చదువుకునేందుకు వీలుగా దగ్గరలోనే స్కూల్ నిర్మిస్తుండడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నప్పటికీ మందుబాబుల ఆగడాలు చూస్తుంటే భయభ్రాంతులకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. రాత్రి సమయాల్లో రోడ్లపై యువత పూటుగా మద్యం సేవించి చిందులేస్తూ హల్చల్ చేయడం, మహిళలకు ఇబ్బంది కలిగించడం వంటి సంఘటనలు ఈ ప్రాంతంలో తరచూ జరుగుతున్నాయి. మాధవధార ప్రాంతం మందుబాబులతో నిండిపోయిందని అంటున్నారు. ఈ విషయం కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని, వారి అండదండలు చూసి రెచ్చిపోతన్నారని మరికొందరు వాపోతున్నారు. మద్యం షాపు ఏర్పాటు చేసిన తర్వాత జంక్షన్ గజిబిజిగా మారిందని, నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగతుందని మరికొందరు అంటున్నారు. ఇటీవల మాధవధార జంక్షన్ సమీపంలో ఓచోట కబడ్డీ పోటీలు జరిగాయి. ఆ పోటీలు చూసేందుకు చాలా మంది అక్కడికి వచ్చారు. ఆ సమయంలో వేర్వేరు ప్రాంతాల నుంచి యువత బైకులపై వచ్చి మద్యం షాపు వద్దకు చేరుకుని ఆ జంక్షన్‌లో హల్‌చల్ చేసి స్థానికులను ఇబ్బందులకు గురి చేశారని చెబుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఏది ఏమైనా ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులకు గురిచేసే డీలర్లను తొలగించండి

తగరపువలస: ఏ డిపోలో అయినా వినియోగదారులకు సరకులు ఇచ్చేలా పౌర సరఫరాల శాఖ డీలర్లకు ఆదేశాలు ఇవ్వాలని సీపీఐ భీమిలి ఏరియా సమితి నాయకులు మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ అన్నారు. వినియోగదారులను ఇబ్బంది పెట్టే డిపోల యజమానులను తొలగించాలన్నారు. ఇకపై వినియోగదారులను ఇబ్బంది పెడితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.